క్లుప్తంగా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


సునీల్

నడికూడ : వ్యక్తిగత కారణాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌటుపర్తి గ్రామానికి చెందిన బిట్ల సునీల్ (27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వ్యక్తగత కారణాలతో ఆదివారం రాత్రి తన రూంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియాలు పూర్తి చేసినట్లు తెలిపారు. చదువులో ముందుండే సునీల్ ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

పంది దాడిలో ఒకరికి గాయాలు



పరకాల : కుక్కలు, కోతుల దాడులే కాకుండా పందుల దాడులతో పట్టణ, గ్రామాల ప్రజల హడలిపోతున్నారు. పిల్లల పంది చేసిన దాడిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నాగారంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పసుల శివకృష్ణ తన ఇంటి సమీపంలోని ఓ చెట్టు కొమ్మలను తొలగించేందుకు వెళ్తున్న క్రమంలో పొదలమాటు నుంచి ఓ పి ల్లల పంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో అతడి పొట్ట, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పంది దాడిలో గాయపడ్డ అతడిని పట్టణంలోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. అయితే పంది వారంరోజుల్లో ముగ్గురిపై దాడి చేసినట్లు నాగారం గ్రామస్తులు తెలిపారు. వీధుల్లోకి వెళ్లాలంటే భయమేస్తుందని, సంబంధిత యజమానిపై చర్యలు తీసుకుని పందులను తరలించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే నివాళి..

ఐనవోలు : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన దౌతుబాజి శ్రావణి, కూకట్ల రాజు ఆదివారం పిడుగుపాటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన సింగపురం ఇందిర కుమారుడు ఇమ్మాన్యుయల్ వేర్వేరుగా బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సీపీఎం మండల కార్యదర్శి లింగయ్య విచారణ వ్యక్తం చేశారు. మృతదేహాలకు నివాళులర్పించారు. నిరుపేద బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



నడికూడ : రైతు0కు పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వం రైతుభరోసాను వెంటనే అందించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతిపత్రం అందించారు.

కమిటీ ఎంపిక కోసం సమావేశం

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీని ఎన్నుకునేందుకు సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు బొమ్మకంటి సాంబయ్య, వైనాల విజయ్‌కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ రజిని సత్యనారాయణతోపాటు గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, కుల పెద్దలు సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను సేకరించారు. గ్రామానికి వైకుంఠరథం వాహనం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్మశాన వాటిక, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, గ్రామంలో గ్రంథాలయ ఏర్పాటుతో పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు అభివృద్ధి కమిటీని ఎన్నుకోవాలని తీర్మాణించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేటలోని దర్గా, హౌజింగ్ బోర్డు కాలనీ, బియాబానీ నగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, జులైవాడ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- రైతువేదికలపై అధికారుల చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన

అత్మకూరు : మండల కేంద్రంలోని రైతువేదికలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో అక్కడకు వచ్చే రైతులు, మహిళా రైతులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలోని రైతువేదికలో గదుల నిర్మాణం, టాయ్‌లెట్లు తదితర పనుల కోసం కేవలం రూ.4 లక్షలు నిధులు విడుదలయ్యాయి. కాంట్రాక్టర్ ఆ నిధులతో పనులు ప్రారంభించాడు. కానీ చాలీచాలని నిధులతో పనులు పూర్తివడం కష్టమని, మరో రూ. 2లక్షలు ఉంటేనే పూర్తవుతాయని సదరు కాంట్రాక్టర్ తెలిపాడు. టాయ్‌లెట్లు అసంపూర్తిగా మారడంతో వాటికి తాళం వేసి దారికి అడ్డుగా ముళ్లకంప వేశారు. టాయ్‌లెట్ల పనులు పూర్తికాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు.

ఎమ్మెల్యే సమావేశాలు ఇక్కడే..

స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారిక సమావేశాలు రైతువేదికలోనే నిర్వహిస్తుంటారు. అయితే సమావేశాలకు వచ్చే వారు కూడా మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకొచ్చి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న టాయ్‌లెట్లు


టాయ్‌లెట్స్ వెళ్లే దారిలో వేసిన ముళ్లకంప

సఖి సేవలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న శ్రీదేవి, హరిత

శాయంపేట : సఖి కేంద్రం అందిస్తున్న సేవలను బాధిత మహిళలు వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత సూచించారు. మండలంలోని మైలారంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, వీఓ ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు సోమవారం సఖి కేంద్రంపై అవగాహన, అందిస్తున్న సేవలను వివరించారు. సఖి కేంద్రం ద్వారా కౌన్సెలింగ్, వైద్య, పోలీస్, న్యాయ సహాయంతో పాటు తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహించబడుతుందన్నారు. ఇందులో 5 రకాల సేవలను అందిస్తున్నామన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు వంటి వాటి నుంచి రక్షణ పొందేందుకు 24 గంటలు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయంలో 181 టోల్ ఫ్రీ, 0870–2452112కు కాల్ చేసి బాధిత మహిళలు సాయం పొందాలని అన్నారు.

సద్దుల బతుకమ్మ, దసరాకు ఏర్పాట్లు చేయాలి


కమలాపూర్ గడి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కమలాపూర్ : మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ సురేష్, సీఐ హరికృష్ణ గ్రామస్థాయి అధికారులకు, పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ, కుల సంఘాల పెద్దలతో సమావేశం నిర్వహించి సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం సద్దుల బతుకమ్మ నిర్వహించే పెద్దచెరువు స్థలాన్ని, దసరా ఉత్సవాలు నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేయాలని అన్నారు. మహిళల ప్రత్యేక పండుగ సద్దుల బతుకమ్మ అని ఆరోజు గ్రామస్థాయి సిబ్బంది చెరువు వద్ద ఉండాలని పంచాయతీ సిబ్బందికి చేశారు. ఈఓ రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌గౌడ్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

తహసీల్దార్ సత్యనారాయణ


శాయంపేట : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

శాయంపేట : నేటి ఆధునిక యుగంలో ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీశివ మార్కండేయ, శ్రీవేంకటేశ్వర ఆలయాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం లలితత్రిపురసుందరిదేవిగా అమ్మవారిని అలంకరించారు. తహసీల్దార్ సత్యనారాయణ హాజరుకాగా ఆలయ అర్చకుడు మార్త రాజ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చేపట్టిన మహా అన్నదాన కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

మామునూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. ఈమేరకు వరంగల్ జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు క్రాస్‌రోడ్డు వరకు, ఐనవోలు నుంచి వర్ధన్నపేట వరకు బల్దియా కమిషనర్ అశ్వని తానాజీవాకడే, ఆర్‌అండ్‌బీ అధికారులు, జీడబ్ల్యూఎంసీ అధికారులతో కలిసి ఆయన సోమవారం సాయంత్రం పర్యటించారు. వర్ధన్నపేట నుంచి వరంగల్ ఆర్టీఏ జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మామునూరు వద్ద తరుచుగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. వర్షాకాలం రోడ్డుపై నీరు నిలిచి ఉండడం వల్ల ప్రమాదాల జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు ఎస్ఈ రాజయ్య, సీపీ రవీంద్ర, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, ఏసీపీ తిరుపతి, ఎన్‌హెచ్ బల్దియా అధికారులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ చెరువు తూముకు బుంగ


తూము వద్ద కుంగిన మట్టి

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో గల ఎల్లమ్మ చెరువు తూముకు బుంగ పడి నీరు వృథాగా పోతుంది. సోమవారం ఉదయం రైతులు గమనించి ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ రాజు అక్కడకు చేరుకుని టిప్పర్ల సహాయంతో మట్టిపోసి జేసీబీతో చదును చేశారు. చెరువు నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో చెరువు పూడిక, మరమ్మతులు చేసిన కాంట్రాక్టర్ నాణ్యతలోపంతో పనులు చేయడంతో ఇప్పటికీ రెండుసార్లు బుంగ పడినట్లు రైతులు, ముదిరాజ్ సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

మురావత్ మంజికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు మురావత్ మంజికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ట్రైబల్ డెవలప్‌మెంట్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏ స్టడీ ఆన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ పాలసీస్ అండ్ ప్రోగ్రామ్స్ ఇన్ ఆసిఫాబాద్ డివిజన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మురావత్ మంజికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వీరన్న పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేశారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు


దామెర : సభ్యత్వ నమోదును చేపట్టిన ప్రేమేందర్ రెడ్డి

దామెర : కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదులో దామెర మండలం నియోజకవర్గంలో మొదటి స్థానంలో నిలవాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరిచి అధిక సంఖ్యలో సభ్యత్వం పొందేలా చైతన్య పర్చాలని కార్యకర్తలకు సూచించారు. ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదు చేపడుతున్న సమయంలో ఏమైన ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ తరుణ్‌కుమార్, రమేశ్, కొమురయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రీకౌంటింగ్‌పై విచారణ జరపాలి

రామన్నపేట: ఇటీవల జరిగిన వరంగల్ పట్టణ గృహనిర్మాణ తాపీ మేస్త్రీల సంఘం ప్రధాన కార్యదర్శి స్థానానికి జరిగిన రీకౌంటింగ్‌పై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ప్రధాన కార్యదర్శి స్థానానికి పోటీ చేసిన దామెర లింగయ్య కోరారు. ఈమేరకు ఎన్నికల నిర్వహణ అధికారులను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 27న జరిగిన వరంగల్ పట్టణ గృహ నిర్మాణ తాపీ మేస్త్రీల సంఘం పోటీ చేసిన రెండు ఓట్ల తేడాతో ముల్కలపల్లి ఐలయ్యపై లింగయ్య గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. అనంతరం 29న రీకౌంటింగ్ జరపాలని ఎన్నికల అధికారులను ముల్కలపల్లి ఐలయ్య కోరారు. అప్పటికే సంఘం కార్యాలయంలో ఉన్న బ్యాలెట్ బాక్స్‌లు తెరిచి ఉండటంతో రీకౌంటింగ్‌లో అనూహ్యంగా లింగయ్య, ఐలయ్య కాకుండా ఇంకో అభ్యర్థి అందుగుల మధుకు మూడు ఓట్ల ఆధిక్యం వచ్చింది.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

నడికూడ : పారిశుద్ధ్య పనుల నిర్వాహణలో నిర్లక్ష్యం వహించొద్దని గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఇటీవల ఏర్పాటు చేసిన వీధిలైట్ల పనితీరును పరిశీలించారు. వీధుల్లో చెత్తాచెదారాన్ని పేరుకుపోకుండా చూసి ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెల 09న నిర్వహించతలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ చేస్తూ మాదిగలను మోసం చేస్తుందని ఆరోపించారు. దీనికి నిరసనగా ఈనెల 09న చలో కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, మల్లేష్, బొడ్డు శాంతిసాగర్, కల్యాణ్, ప్రశాంత్, బాబు, రాజు, సిద్దిక్, సత్యం, అజిత్, బాబు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన చేరాల భిక్షపతి ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబానికి పద్మశాలి పరపతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. అంతకుముందు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎల్తూరి పోచయ్య అనారోగ్యంతో మృతిచెందగా ఆయన దహన సంస్కారాల నిమిత్తం తెలంగాణ రాజ్యాధికార ఐక్య సమితి అధ్యక్షుడు పుల్ల శ్రీనివాస్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు బొప్ప శివశంకర్, సభ్యులు పొరండ్ల కుమారస్వామి, తుమ్మ రాజు, సహదేవ్, రాజమౌళి, నరసింహస్వామి, ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎల్కతుర్తి : ట్రస్మా ఫౌండర్‌గా పని చేసిన తనను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో గల ఎస్ఆర్‌కే పాఠశాల ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. మెదక్, అదిలాబాద్, నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ట్రస్మా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశిరెడ్డి ఆదిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, రాజేందర్, సమ్మిరెడ్డి, నరసింహరెడ్డి, ఉమామహేశ్వర్, రమేశ్, మల్లేష్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

ఐనవోలు: ఇటీవల జరిగిన జమ్మూకశ్మీర్, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఏఐసీసీ నేషనల్ జాయింట్ కో ఆర్డినేటర్, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ ఉల్లెంగుల యాదగిరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో హర్యానాలో కాంగ్రెస్ పూర్తి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, జమ్మూ కశ్మీర్‌లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతీ వ్యక్తి కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి కృషి

శాయంపేట : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని, అభివృద్ధికి కృషి చేస్తానని పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. మార్కెట్ యార్డ్‌లో ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, డైరెక్టర్లు శానం కుమారస్వామి, వైద్యుల రాజిరెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, రంగుబాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

లలితాత్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు


ఎల్కతుర్తి : ముల్కనూరులో దుర్గామాత అమ్మవారి వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు


కమలాపూర్ : అన్నప్రసాద వితరణ చేస్తున్న సీఐ హరికృష్ణ


వేలేరులో..


ఆత్మకూరు : శరన్నవరాత్రి వేడుకలకు హాజరైన భక్తులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గామాత మండలం వద్ద సోమవారం మహిళలు పెద్దెత్తున హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొన్న మహిళలు ఉపవాస దీక్షతో ఉండి కుంకుమ పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాగా దుర్గామాత లలితాత్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. నిర్వాహకులు బైరి రాంబాబు, ఉడుత శ్రీనాథ్, సదానందం, త్రిజ్ఞానేష్, లోకేష్, అభినయ్, చాణక్య, లోహితాక్షు, శివ, అనిరుద్, విశృత్, అక్షయ్, శ్రీలత, సునిత, ఉద్యమ, చందన, నికిత పాల్గొన్నారు. అలాగే కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో భద్రకాళి అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది.

మహా అన్నప్రసాద వితరణ

కమలాపూర్ : దేవీశరన్నవరాత్రోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీకనుకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద సోమవారం మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. స్థానిక సీఐ హరికృష్ణ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అంతకుముందు సీఐ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తవాడలో కనుకదుర్గ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత వద్ద ఆదివారం రాత్రి నిర్వాహకులు భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేశారు. కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ కుమారస్వామి, కనుకదుర్గ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్, ఉపాధ్యక్షుడు రాకేష్, కార్యదర్శి అనిల్, కనుకదుర్గ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి తిరుపతి, కోశాధికారి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని పీచరలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, నవగ్రహ ఆరాధన, నిత్య కుంకుమార్చన, నిత్యారాధన అర్చకులు భంగిమఠం స్మార్థిక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు ఉప్పుల వనమాల ఆమె తనయుడు శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి మహాఅన్నదానం చేశారు. దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా భక్తులు దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నగరంలో చేపల మార్కెట్లు నిర్మించాలి

వరంగల్ అర్బన్: నగరంలోని అనేక ప్రాంతాల్లో రహదారులపై చేపలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులకు ఆయా ప్రాంతాల్లో మార్కెట్లు నిర్మించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట చిరువ్యాపారులతో కలిసి నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పుట్‌పాత్‌లనే జీవనాధారం చేసుకొని చేపలు విక్రయిస్తున్నారని తెలిపారు. నగరంలో ప్రత్యేకంగా 10 ఎకరాల స్థలం కేటాయించి రూ.50 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో హోల్‌సేల్, రిటైల్, ఎక్స్‌పోర్ట్ మార్కెట్లను నిర్మించాలని కోరారు. హనుమకొండ ఓల్డ్ బస్ డిపో, కాజీపేట బాపూజీనగర్, ఫాతిమా రోడ్డు, వడ్డేపల్లి తిరుమల జంక్షన్, కుమార్‌పల్లి, పెగడపల్లి డబ్బాలు, హసన్‌పర్తి చెరువు కట్ట, తదితర ప్రాంతాల్లో చిరు వ్యాపారులు చేపలు అమ్ముకుంటున్నారని వివరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు విజేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు దుర్గయ్య పాల్గొన్నారు.